- జిట్టాకు మాజీ మంత్రులు హరీశ్, తలసాని పరామర్శ

అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డిని మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం జిట్టా కుటుంబ సభ్యులతో హరీశ్‌రావు మాట్లాడారు. వారి వెంట ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఉన్నారు. – యాదాద్రి భువనగిరి, నమస్తే తెలంగాణ

వైద్యశాఖలో ఏజెన్సీల దందా

- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాల్లో కోతలు
- నెలకు 2 కోట్లు దండుకుంటున్న ఏజెన్సీలు
- ఏజెన్సీ కట్టాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ సైతం వేతనాల్లో నుంచే కోత
- ఒక్కో కార్మికుడి నుంచి వెయ్యికి పైగా దోపిడీ

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్య శాఖ పరిధిలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది శ్రమదోపిడీకి గురవుతున్నారు. కాంట్రాక్టర్లు, మ్యాన్‌పవర్ ఏజెన్సీలు.. నిబంధనల మేరకు పూర్తి వేతనాలు చెల్లించడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో కార్మికుడికి ప్రతి నెలా సగటున రూ.వెయ్యి వరకు ఎగ్గొడుతున్నారని ఆరోపిస్తున్నారు. దీంతోపాటు వాస్తవంగా పనిచేస్తున్నవారి కంటే, రిజిస్టర్‌లో ఎక్కువ పేర్లు చూపుతున్నారని, ఇలా నెలకు కనీసం రూ.2 కోట్ల వరకు కాంట్రాక్టర్లు దండుకుంటున్నారని చెప్తున్నారు. వైద్యారోగ్య శాఖలో డీఎంఈ, టీవీవీపీలో పెద్ద ఎత్తున కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. ముఖ్యంగా శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ విభాగాల్లో వీరు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 వేల మందికిపైగా పనిచేస్తున్నట్టు అంచనా. వీరికి ఇచ్చే అరకొర జీతాల్లో అడ్డగోలు కోతలు పెడుతున్నారని, ప్రభుత్వానికి ఇచ్చే లెక్కల్లో మాత్రం పూర్తిగా చెల్లిస్తున్నట్టు చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల కిందట సూర్యాపేటలో వేతనం అందక ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య నేపథ్యంలో కాంట్రాక్టర్లు, మ్యాన్‌పవర్ ఏజెన్సీల దోపిడీపై వైద్యవర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతున్నది. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సైతం ఇవే ఆరోపణలు చేస్తున్నది.

జీతంలో 4,500 కట్

2021 జూన్ 11న నాటి ప్రభుత్వం విడుదల చేసిన జీవో 60లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను స్పష్టం చేసింది. గ్రేడ్-1 వర్కర్లకు రూ.15,600, గ్రేడ్-2 వర్కర్లకు రూ.19,500, గ్రేడ్-3 వర్కర్లకు రూ.22,750 వేతనాలు ఇవ్వాలని జీవోలో స్పష్టంగా పేర్కొన్నది. దవాఖానల్లో పనిచేసే కార్మికులు గ్రేడ్-1 క్యాటగిరీలోకి వస్తారు. ఇందులో పీఎఫ్, ఈఎస్ఐ కింద రూ.3,507 పోగా, మిగిలిన రూ.12,093 కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. కానీ, తమకు రూ.11 వేలు మాత్రమే ఇస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. అంటే ఒక్కొక్కరికి రూ.1093 చొప్పున తగ్గిస్తున్నారు. ఇదేమని అడిగితే పీఎఫ్, ఈఎస్ఐ కింద కడుతున్నట్టు చెప్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐకి సంబంధించి వారి వేతనాల్లో నుంచి సగం, మ్యాన్‌పవర్ ఏజెన్సీలు సగం చెల్లించాల్సి ఉంటుంది. కానీ మ్యాన్ పవర్ ఏజెన్సీలు కట్టాల్సింది కూడా కార్మికులకు వేతనాల్లో నుంచే తీసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దవాఖానల్లో పడకల ఆధారంగా శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ సిబ్బందిని నియమించాల్సి ఉంటుంది. ఉదాహరణకు వంద పడకల దవాఖానకు 45 మంది సిబ్బంది ఉండాలి. వీరు మూడు షిఫ్టుల్లో పనిచేయాలి. కానీ, అనేక చోట్ల పేపర్లపై లెక్కల కన్నా పనిచేసే సిబ్బంది తక్కువగా ఉంటున్నారని చెప్తున్నారు. ఈ వేతనాలు మొత్తం కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళ్తున్నాయని ఆరోపిస్తున్నారు.

బోనాల సందర్భంగా హైకోర్టులో ఆదివారం జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు జస్టిస్ మాధవిదేవి, జస్టిస్ సూరేపల్లి నంద

మంత్రి కంపెనీ.. 'విదేశీ' ష్యూరిటీ

మొదటిపేజీ తరువాయి...

కాలం తీరిపోయాయని, కొత్త గ్యారెంటీలు సమర్పించాలని కోరింది. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ, ఈసారి ఎగ్జింబ్యాంకు నుంచి కాకుండా ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి కానీ, షెడ్యూల్డ్ బ్యాంకు నుంచి గ్యారెంటీలు సమర్పించాలని లేఖలో స్పష్టంగా పేర్కొన్నది. అయితే, బ్యాంకు గ్యారెంటీల గడువు జూన్ 30న ముగిస్తే ఈ నెల 18న ఏపీఎస్పీడీసీఎల్ లేఖ రాయడం గమనార్హం.

ఎక్కడి కంపెనీ.. ఎక్కడి గ్యారెంటీలు

హైదరాబాద్‌లో ఉండే రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఎక్కడో కరీబియన్ దీవుల్లోని బ్యాంకు నుంచి గ్యారెంటీలు సమర్పించడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. దేశంలో బోల్డన్ని బ్యాంకులు ఉండగా దేశం కాని దేశం వెళ్లి అక్కడి నుంచి గ్యారెంటీలు సమర్పించడం అందరినీ ఆశ్చర్యపరుస్తున్నది. మన రాష్ట్రంలో, ఆ మాటకొస్తే మన దేశంలో ఒక్క శాఖ కూడా లేని బ్యాంకు మంత్రి కంపెనీకి గ్యారెంటీలు సమర్పించడం విడ్డూరంగా ఉన్నది.

ఎగ్జిబ్యాంక్‌పై అనేక ఆరోపణలు

వెస్టిండీస్‌లోని సెయింట్ లూసియాలో కేంద్రంగా ఉన్న ఈ యూరో ఎగ్జిబ్యాంక్‌పై అనేక ఆరోపణలున్నాయి. మధ్యప్రదేశ్‌లో ఓ సంస్థ డిఫెన్స్ పనుల కాంట్రాక్టును సాధించింది. పనులు చేపట్టే ముందు ఈ బ్యాంకు నుంచే గ్యారెంటీలు సమర్పించింది. వాటిని ఆధారంగా చేసుకొని అధికారులు పనులు అప్పగించారు. చివరకు ఆ సంస్థ బిచాణా ఎత్తేసింది. పనులను పూర్తిచేయలేదు. దీంతో అధికారులు నష్టపరిహారం కోసం బ్యాంక్ గ్యారెంటీలను స్వాధీనం చేసుకుందామనుకుంటే వాళ్లు సమర్పించిన గ్యారెంటీలు చెల్లలేదు. వాటితో తమకు ఎలాంటి సంబంధమూ లేదని బ్యాంకు తేల్చిచెప్పింది. దీంతో రక్షణశాఖ న్యాయపోరాటం ప్రారంభించింది. యూరో ఎగ్జిం బ్యాంక్ మన దేశంలో ఇస్తున్న బ్యాంక్ గ్యారెంటీల పరిస్థితిపై లోక్‌సభ సభ్యుడు కార్తి చిదంబరం భారతీయ రిజర్వు బ్యాంకు గవర్నర్ శక్తికాంతదాస్‌కు లేఖ రాశారు. మన దేశంలో ఎగ్జిబ్యాంక్ కార్యకలాపాలకు ఆర్బీఐ ఎప్పటి నుంచి అనుమతులు ఇస్తున్నది? అసలు వీటిని నమ్మవచ్చా? వీటిపై మనకు నియంత్రణ ఉంటుందా? వీటి పరిధిని ఎలా నిర్దేశించారంటూ ఈ ఏడాది జూలై 31వ తేదీన లేఖ రాశారు. ఎగ్జిం బ్యాంక్ ఇచ్చే బ్యాంక్ గ్యారెంటీలపై లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు.

ఏపీలో రూ. 550 కోట్ల విలువైన గ్యారెంటీలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మైనింగ్, విద్యుత్తు పంపిణీ, ఉత్పత్తి సంస్థలు, గిడ్డంగుల సంస్థకు రూ. 550 కోట్లమేర ఎగ్జింబ్యాంకు నుంచి ఇచ్చిన గ్యారెంటీలే ఉన్నాయి. ఇక్కడ కాంట్రాక్టర్లు డిఫాల్టయి పనులు చేయలేకపోయినా, ప్రభుత్వానికి ఏదైనా నష్టం వాటిల్లినా బ్యాంకు గ్యారెంటీలను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తే ఎగ్జింబ్యాంకు తనకెలాంటి బాధ్యత లేదని ప్రకటిస్తే ప్రభుత్వాలు చేసేదేమీలేదు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కంపెనీలు విరివిగా ఎగ్జింబ్యాంకు గ్యారెంటీలనే సమర్పిస్తున్నట్టు ఏపీ అధికార వర్గాలు చెప్తున్నాయి.

తీగలకు అడ్డు వస్తే చెట్లను నరుకుతారా?

విద్యుత్తు అధికారులపై ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫైర్

సిద్దిపేట, ఆగస్టు 25 : విద్యుత్తు తీగలకు అడ్డు వస్తున్నాయని కొమ్మలను గాకుండా చెట్లనే నరికి వేస్తారా? అంటూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విద్యుత్తు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో చెట్లను నరకడాన్ని గమనించిన ఆయన ఈ విషయమై విద్యుత్ అధికారులను ప్రశ్నించారు. 'పసిపిల్లల్లా ఇరవై ఏండ్లుగా చెట్లను పెంచాం.. కరెంట్ తీగలకు అడ్డం వస్తే చెట్లను కాదు.. కొమ్మలను నరకండి.. పూర్తిగా చెట్లను నరికివేయడం ఏమిటి? అని నిలదీశారు. ముందుచూపు లేకుండా, పర్యవేక్షణ లేకుండా గుడ్డిగా కార్మికులను పెట్టి చెట్లను తొలగించడంపై మండిపడ్డారు. పర్యావరణానికి ఎంతో ఉపయోగపడే చెట్లను విచక్షణారహితంగా తొలగించడం దుర్మార్గమని, తొలగించాలని ఆదేశించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

మరో పోరాటానికి ఆర్టీసీ కార్మికులు సిద్ధం

- ఉద్యమ కార్యాచరణను ప్రకటించిన జేఏసీ
- 27న నల్లబ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసనలు
- అక్టోబర్ 1న ఇందిరాపార్క్ వద్ద సామూహిక దీక్ష

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): పెండింగ్ సమస్యల పరిష్కారంతోపాటు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు మరో పోరాటానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు ఆదివారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన టీజీఎస్ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, థామస్‌రెడ్డి తమ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తిచేయడంతోపాటు కార్మికులకు బకాయిలతో సహా రెండు పీఆర్సీలు చెల్లిస్తామని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు, సదుపాయాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రేవంత్ సర్కారును కోరారు. అధునాతన సౌకర్యాలతో కొత్త సర్వీసులు ప్రారంభిస్తామని, యూనియన్లను పునరుద్ధరిస్తామని, కార్మికులను పీఆర్సీ పరిధిలోకి తీసుకొస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. 9 నెలలు గడుస్తున్నా ఒక్క హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. రేవంత్ సర్కారు తీరును ఎండగడుతూ ఈ నెల 27న రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులంతా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 10న డిమాండ్స్ డే బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తిస్తామని, అక్టోబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద సామూహిక దీక్ష నిర్వహిస్తామని వెంకన్న, థామస్‌రెడ్డి తెలిపారు.

తల్లిని హతమార్చి.. కొడుకు ఆత్మహత్య

నల్లగొండ జిల్లా నిడమనూరులో ఘటన

నిడమనూరు, ఆగస్టు 25: మద్యానికి డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తి తల్లి గొంతు కోసి ఆపై తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా నిడమనూరులో ఆదివారం వెలుగుచూసింది. పోలీసులు కథనం ప్రకారం.. రావిరాల శివకుమార్(36) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి అక్క కూతురితో వివాహమైంది. ఆ తరువాత అతడు భార్యతో తరచూ గొడవ పడేవాడు. మూడు నెలల క్రితం పంచాయితీ పెట్టి విడాకులు తీసుకున్నారు. ఈ ఘటన తర్వాత మద్యానికి డబ్బులివ్వాలంటూ తల్లి దండ్రులతో గొడవ పడేవాడు. శనివారం రాత్రి కూడా తల్లిని డబ్బులివ్వాలని కోరగా లేవని చెప్పింది. ఆమెపై మరింత కోపం పెంచుకున్నాడు. బయటకు వెళ్లి మద్యం తాగి అర్ధరాత్రి ఇంటికి వచ్చాడు. అప్పటికే మంచంపై నిద్రిస్తున్న తల్లి గొంతును కూరగాయల కత్తితో కోశాడు. ఆమె ప్రాణాలు విడవగానే.. అదే కత్తితో శివకుమార్ తన గొంతు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

విద్య, వైద్యంపై సర్కారు నిర్లక్ష్యం

- గాంధీ, ఉస్మానియాలో మందులు లేవు
- గురుకులాల్లో కలుషితాహారం
- సుపరిపాలన వేదిక అధ్యక్షుడు పద్మనాభరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక నెరవేర్చేందుకు సతమతమవుతున్నదని సుపరిపాలన వేదిక అధ్యక్షుడు పద్మనాభరెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో విద్య, వైద్యం అధ్వానంగా తయారైందని, గాంధీ, ఉస్మానియా వంటి ప్రధాన దవాఖానల్లో మందులు లేవని మండిపడ్డారు. ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ధర్మాసుపత్రుల్లో ఓపీలు మాత్రమే నడుస్తున్నాయని, ఫార్మసీల్లో మందులు లేకపోవడంవల్ల ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. గురుకులాల్లోనూ కలుషిత ఆహారం ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఉచితాలకు బ్రేకులు వేసి నాణ్యమైన విద్య, వైద్యంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని సూచించారు.

హైడ్రా బాధితులకు ప్రభుత్వం స్థలం కేటాయించాలి

హైడ్రా చేపడుతున్న చర్యలపై పద్మనాభ రెడ్డి స్పందిస్తూ, పేదలు, మధ్యతరగతి వర్గాలపై మానవీయ కోణంలో వ్యవహరించాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు మంజూరు చేసిన అధికారులపై చర్యలకు ప్రభుత్వం ఓ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని అనుమతులూ ఉండటంతో పేద, మధ్యతరగతి వర్గాలు కూడబెట్టుకున్న సొమ్ముతో ఇండ్లను కొనుగోలు చేశారని, ఇప్పుడు వాటిని కూలగొట్టడంతో తీవ్ర ఇబ్బందుల్లో పడ్డారని పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు ఉన్నాయనే భరోసాతో కొనుగోలు చేసినవారికి మరోచోట ప్రభుత్వం స్థలాలు కేటాయించాలని కోరారు.

రాజడి

ఫిక్స్‌డ్ Vs ఫ్లోటింగ్

గృహ రుణాలపైనున్న ఈ వడ్డీరేట్లలో తేడాలేంటి?

ఫిక్స్‌డ్ రేటు

మనం తీసుకున్న గృహ రుణంపై వడ్డీరేటు ఫిక్స్‌డ్‌గా ఉంటే.. రుణ కాలపరిమితి మొత్తం ఒకే రకమైన వడ్డీరేటు ఉంటుంది. దీంతో ఈఎంఐ (నెలవారీ వాయిదా మొత్తాలు)ల్లో ఎలాంటి మార్పులూ ఉండవు. అయితే కొన్ని బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు కొంత కాలం తర్వాత ఫిక్స్‌డ్ రేటును ఫ్లోటింగ్ రేటుగా మార్చుకునేందుకు రుణగ్రహీతలకు అవకాశం ఇస్తున్నాయి.

ఫ్లోటింగ్ రేటు

తీసుకున్న హోమ్ లోన్‌పై ఫ్లోటింగ్ వడ్డీరేటు ఉంటే.. రుణ కాలపరిమితిలో వడ్డీరేట్లు మారుతూ ఉంటాయి. మార్కెట్ ఒడిదొడుకులు, రిజర్వ్ బ్యాంక్ రెపో రేటు ఆధారంగా వడ్డీరేట్లలో హెచ్చుతగ్గులకు వీలుంటుంది. దీనివల్ల రుణ గ్రహీతలు చెల్లించే ఈఎంఐలు కూడా ఎక్కువ, తక్కువ అవుతుంటాయి. లేదా రుణ కాలపరిమితి తగ్గుతూ, పెరుగుతూ ఉంటుంది.

	ఫిక్స్‌డ్ రేటు	ఫ్లోటింగ్ రేటు
వడ్డీరేటు	రుణ కాలపరిమితి మొత్తంగా ఒకేలా ఉంటుంది.	బెంచ్‌మార్క్ రేటు ప్రకారం మారుతుంది.
ఆరంభంలో	ఫ్లోటింగ్ రేటు కంటే 1-2% ఎక్కువగా ఉంటుంది.	ఫిక్స్‌డ్ రేటు కంటే తక్కువగా ఉన్నా తర్వాత పెరుగుతుంది.
టెన్యూర్	రుణ కాలపరిమితి మారదు.	వడ్డీరేట్లనుబట్టి కాలపరిమితి మార్పు
ఈఎంఐ	మారదు.	వడ్డీరేట్లు తగ్గినప్పుడు, పెరిగినప్పుడు మారగలదు.
ముందస్తు చెల్లింపు	జరిమానాలుంటాయి.	జరిమానాలు పడవు.
ఎప్పుడు ఎంచుకోవచ్చు	వడ్డీరేట్లు పెరిగే వీలుందని తెలిస్తే ఫిక్స్‌డ్ రేట్లు ఉత్తమం.	వడ్డీరేట్లు తగ్గుతాయనుకుంటే ఫ్లోటింగ్ రేట్లే లాభం.
గుర్తుంచుకోండి	5-10 ఏండ్ల వ్యవధితో రుణాలు తీసుకుంటే ఇది లాభం.	15-20 ఏండ్లపాటు రుణ చెల్లింపులుంటే దీనివల్ల ప్రయోజనం.

- కాబట్టి గృహ రుణం తీసుకునే ముందు ఏ రేటు మంచిదో తెలుసుకునిమరీ ఓ నిర్ణయానికి రావడం తెలివైన పని.

ఎఫ్‌డీ రేట్లు పెరిగాయ్



ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) అనేది ఓ సురక్షిత పెట్టుబడి సాధనం. అంతేగాక హామీ పూర్వక రాబడి పథకం కూడా. నిర్దిష్ట రీతిలో చేసే ఏకకాల నగదు మొత్తాలపై నిర్ణీత కాలవ్యవధులకుగాను స్పష్టమైన వడ్డీరేట్లను ఇందులో చెల్లిస్తారు. పోస్టాఫీస్, ప్రభుత్వ-ప్రైవేట్ రంగ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో ఎఫ్‌డీ స్కీములు అందుబాటులో ఉంటున్నాయి. మార్కెట్ రిస్కులకు దూరంగా ఉండాలనుకునే మదుపరులకు ఈ ఎఫ్‌డీలు చక్కని పెట్టుబడి సాధనాలని చెప్పవచ్చు. అలాగే తమ పెట్టుబడుల్లో వైవిధ్యాన్ని చూపుతూ మార్కెట్, నాన్-మార్కెట్ లింక్డ్ ఆప్షన్లను ఎంచుకోవాలనుకునేవారికీ ఎఫ్‌డీలు సరైనవే. అయితే సాధారణ డిపాజిటర్లకు, సీనియర్ సిటిజన్స్‌కు వడ్డీరేట్లలో తేడాలూ ఉంటాయి. సీనియర్ సిటిజన్స్‌కు కొంత ఎక్కువ మొత్తంలో ఆయా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు వడ్డీ రేటునిస్తున్నాయి. కాగా, బ్యాంకులు రుణాలను ఎక్కువగా ఇస్తున్నాయని, డిపాజిట్లు మాత్రం తగ్గిపోతున్నాయని, రెండింటి మధ్య బ్యాలెన్స్ లేకపోతే చిక్కులు తప్పవని అటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ), ఇటు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో బ్యాంకింగ్ రంగం ఎఫ్‌డీల వృద్ధిపై దృష్టి సారించింది. ఇందులో భాగంగానే డిపాజిటర్లను ఆకర్షించేందుకు వివిధ కాలపరిమితి ఎఫ్‌డీలపై ఇటీవల వడ్డీరేట్లను పెంచాయి. ప్రస్తుతం జనరల్, సీనియర్ సిటిజన్స్‌కు అత్యుత్తమ వడ్డీరేట్లు ఏ సంస్థల్లో, మరే టెన్యూర్స్‌పై ఉన్నాయో ఒక్కసారి చూద్దాం.

- 500 రోజుల ఎఫ్‌డీపై ఆర్బీఎల్ బ్యాంక్ సాధారణ కస్టమర్లకు అత్యధికంగా 8.10 శాతం వడ్డీ ఇస్తున్నది. సీనియర్ సిటిజన్లకైతే 8.60 శాతం ప్రకటించింది.
- 4 ఏండ్ల 7 నెలల (55 నెలలు) ఎఫ్‌డీపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 7.40 శాతం వడ్డీరేటును అందిస్తున్నది.
- 666 రోజుల ఎఫ్‌డీపై బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీరేటు 7.30 శాతం.
- 444 రోజుల ఎఫ్‌డీపై ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ 7.30 శాతం వడ్డీరేటును ఇస్తున్నది.
- 444 రోజుల ఎఫ్‌డీలపై ఎస్బీఐ, కెనరా బ్యాంకులు 7.25 శాతం వడ్డీరేటునిస్తున్నాయి. సీనియర్ సిటిజన్లకైతే 7.75 శాతం వడ్డీనిస్తున్నది ఎస్బీఐ.
- 15 నెలలు-రెండేండ్ల కాలవ్యవధి ఎఫ్‌డీలకుగాను ఐసీఐసీఐ బ్యాంక్ 7.25 శాతం వడ్డీరేటును ప్రకటించింది.
- 666 రోజుల ఎఫ్‌డీపై బ్యాంక్ ఆఫ్ బరోడాలో 7.25 శాతం వడ్డీరేటు నడుస్తున్నది. సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం వడ్డీ వస్తుంది. 333 రోజుల ఎఫ్‌డీ కూడా ఉన్నది. దీనిపై సాధారణ డిపాజిటర్లకు 7.15 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.65 శాతం వడ్డీ అందుతుంది.
- 400 రోజుల ఎఫ్‌డీపై పంజాబ్ నేషనల్ బ్యాంక్ 7.25 శాతం వడ్డీరేటును చెల్లిస్తున్నది.
- 400 రోజుల ఎఫ్‌డీపై సాధారణ డిపాజిటర్లకు 7.25 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం వడ్డీ ఇండియన్ బ్యాంక్ ఇస్తున్నది. 300 రోజుల ఎఫ్‌డీకి వడ్డీరేట్లు వరుసగా 7.05 శాతం, 7.55 శాతంగా ఉన్నాయి.
- 17 నెలల ఎఫ్‌డీకి యాక్సిస్ బ్యాంక్ 7.20 శాతం వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నది.
- 375 రోజుల ఎఫ్‌డీపై ఐడీబీఐ బ్యాంక్ వడ్డీరేటు 7.25 శాతం. సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం. 444 రోజుల ఎఫ్‌డీపై సాధారణంగా 7.35 శాతం వడ్డీ వస్తున్నది. సీనియర్ సిటిజన్లకు 7.85 శాతం లభిస్తుంది.



ఎఫ్‌డీల్లో ఏయే రకాలు?

ఫిక్స్‌డ్ డిపాజిట్లలో అనేక రకాలున్నాయి. కాబట్టి పెట్టుబడులు పెట్టేముందు వాటి గురించి తెలుసుకోవడం ఉత్తమం. అప్పుడే మీ అవసరాలకు తగిన విధంగా డిపాజిట్లు చేయగలరు.

- **కార్పొరేట్ ఎఫ్‌డీలు** ఈ ఎఫ్‌డీలను కంపెనీలు (బ్యాంకులు మినహా) చేస్తాయి.
- **స్టాండర్డ్ ఎఫ్‌డీలు** ఇవి బేసిక్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీములు. నిర్దిష్ట కాలవ్యవధి పూర్తయిన తర్వాత డిపాజిట్లను తీసుకోవచ్చు.
- **సీనియర్ సిటిజన్ ఎఫ్‌డీలు** 60 ఏండ్ల వయసు దాటినవారు మాత్రమే వీటికి అర్హులు. చాలా సంస్థలు వీరికి ప్రత్యేకంగా వడ్డీరేటును అధికంగా చెల్లిస్తాయి.
- **ట్యాక్స్-సేవింగ్ ఎఫ్‌డీలు** వీటికి పన్ను మినహాయింపులుంటాయి. అయితే గరిష్ఠంగా ఏటా రూ.1.5 లక్షల వరకే డిపాజిట్ చేసుకోవచ్చు. ఎఫ్‌డీ కాలవ్యవధి కూడా ఐదేండ్లుంటుంది.
- **క్యుములేటివ్ ఎఫ్‌డీలు** త్రైమాసిక, అర్ధవార్షిక, వార్షిక ప్రాతిపదికన వడ్డీల జమ ఉంటుంది. కాలపరిమితి తీరితేనే వడ్డీ చెల్లింపు.
- **నాన్-క్యుములేటివ్ ఎఫ్‌డీలు** నెల, త్రైమాసిక, అర్ధవార్షిక లెక్కన వడ్డీ మొత్తాలను తీసుకోవచ్చు. రెగ్యులర్ ఇన్‌కమ్ కోరుకునేవారికి అనువైనవి. పెన్షనర్లకు లాభం.
- **ఫ్లెక్సీ ఎఫ్‌డీ ప్లాన్లు** వీటిలో డిపాజిటర్లు తమ సేవింగ్స్ అకౌంట్‌తో ఎఫ్‌డీ అకౌంట్‌ను అనుసంధానం చేసుకోవచ్చు. అధిక వడ్డీరేట్లను పొందే వీలున్నది.
- **ఎన్ఆర్‌వో ఎఫ్‌డీ అకౌంట్** ఎన్నారైలు భారత్ నుంచి పొందే ఆదాయాన్ని ఈ నాన్-రెసిడెంట్ ఆర్డినరీ (ఎన్ఆర్‌వో) ఖాతాల్లో డిపాజిట్ చేసుకోవచ్చు. దీనిపై వచ్చే వడ్డీని పూర్తిగా తీసుకోవచ్చు. కానీ పన్నులు వర్తిస్తాయి. అలాగే చేసిన డిపాజిట్‌లో మాత్రం నిర్దేశిత పరిమితి మేరకే ఉపసంహరించుకోవడానికి వీలుంటుంది.
- **ఎన్ఆర్ఈ ఎఫ్‌డీ అకౌంట్** ప్రవాస భారతీయులు ఈ నాన్-రెసిడెంట్ ఎక్స్‌టర్నల్ (ఎన్ఆర్ఈ) ఖాతాను భారత్‌లో నిర్వహించవచ్చు. విదేశాల్లో సంపాదించిన సొమ్మును ఇందులో డిపాజిట్ చేసుకోవచ్చు. అలాగే ఈ డిపాజిట్లను, వాటిపై పొందే వడ్డీ మొత్తాలను పూర్తిగా వెనక్కి తీసుకోవచ్చు. పైగా వడ్డీలకు పన్ను లుండవు.

అప్రమత్తత అవసరం

దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం లాభాల్లో కదలాడాయి. మదుపరులలో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. దీంతో ఓవరాల్‌గా క్రిందటి వారం మార్కెట్లు లాభాలనే సంతరించుకున్నాయి. ఫలితంగా అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 649.37 పాయింట్లు ఎగిసి 81,086.21 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 282 పాయింట్లు ఎగబాకి 24,823.15 దగ్గర నిలిచింది. అయితే సూచీలు వరుస లాభాల్లో, పైగా ఆల్‌టైమ్ హై దరిదాపుల్లో ఉన్నందున ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది. సెల్లింగ్ ప్రెషర్ లేదా లాభాల స్వీకరణకు ఆస్కారం ఉందని మెజారిటీ మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుంటే ఈ వారం ఒడిదొడుకులకు అవకాశం కనిపిస్తున